కథా కౌముది

# సొబతి

బట్టు విజయకుమార్

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



ఆ రోజు సోమవారం. ఉదయం 5గంటలు అవుతుంది. ఎడ్ల సంతకు వెళ్ళాలి. ఎడ్లను తీసుకుపోతున్నానంటు లాక్య నాయక్ తన భార్యను లేపాడు. లేవకపోయేసరికి సరే వెళ్తున్నానంటూ లేచాడు. తనగొంతును విని ఆ రెండెడ్లు లేచి నిలబడ్డాయి. ఆ రెండెడ్లను విడిచి సంతకని తోల్కపోతున్నాడు. ఇంటినుంచి అడుగులు దూరమయ్యే కొద్ది గుండెల్లో భారం పెరుగుతోంది. గుండె నిండ నీరు నింపుకుంటున్నాడు. ఒక్కొక్క ఇల్లు దాటుతున్నప్పుడు మనసు చలించిపోతుంది. తండాను దాటాడు. గుండెల్లో నిండిన నీరు ఒక్కసారిగా కళ్ళనుంచి అచేతనంగా బయటికి

దూకాయి. వచ్చిన కన్నీళ్ళను తన రుమాలుతో తుడుచుకుంటూ, అలా ఎడ్లవైపు తిరిగి చూసాడు. ఆ ఎడ్లు తమ కన్నీళ్ళు కనబడకుండా తమ చెవులను అడ్డంగా పెట్టాయి. ఎడ్లు కారుస్తున్న కన్నీళ్ళను చూశాడు లాక్యానాయక్. "నిన్న అప్పువాడు వచ్చి, అప్పు కట్టకుంటే నీ యిల్లు తాకట్టు పెడతాననిచెప్పింది విన్నాయేమో? ప్రొద్దున భార్యతో ఎడ్లను అమ్మేద్దామని చెప్పింది గ్రహించాయేమో? నా ముఖకవళికలను చూసి అప్పులో ఇరుక్కున్నానని తెలుసుకున్నాయేమో"నన్నట్లు మనసులో అనుకుంటూ ఏడుస్తున్నాడు లాక్యానాయక్. ఆ ఎడ్లను అమ్మేద్దామంటే ఇంట్లో అందరూ సంతోషించేవారే. ఎందుకంటే వాటికి మేత వేయాలి. నీళ్ళుపెట్టాలి. అందరికి అవి చాలా బరువుగా మారాయి. వాటిని అమ్మేద్దామనగానే ఎప్పుడు అన్నట్టుగా చూశారు ఇంట్లో. మనసులో ఏడుస్తున్నాడు లాక్యానాయక్.

ఆ ఎడ్ల వీపుమీద తన రెండు చేతులను తిప్పాడు. ఆ ఎడ్లు తలను ఆడిస్తూ మేము ఏడవడం లేదు. నీవు బాధపడకంటూ తమ తోకతో లాక్యను చరిచాయి. తండా వెలుతురు చాలా దూరం ఉండిపోయింది. ఆ ఎడ్లు ఠీవిగా నడుస్తూ ఒక అడుగు లాక్యానాయక్ కంటే ముందే పెడుతున్నాయి. అవి ఉంటే లాక్యానాయక్‌కి ధైర్యం, అవి ఉంటే ఆకలి, దాహం అనేది అసలే వేయవు. అలా ఏడుస్తూ తిరిగి గతంలోకి వెళ్ళిపోయాడు.

ఆ ఎడ్లను కొన్నప్పుడే "మోరియా" అని పేర్లు పెట్టుకున్నాడు. 'మోరియా' అని పిలిస్తే పరుగెత్తుకుంటూ వచ్చేవి చిన్నపిల్లల్లాగా. వాటిని చూసి సగం దుఃఖం తీరిపోయేది. చేనులో పందిరి కింద వాటి మకాం. వాటిని అక్కడే కట్టివేసి మధ్యాహ్నం నీరు తాగించడానికి వెళితే ఇతనిని చూసి రెండెడ్లు నిలిచి అరుస్తూ మెడను, తోకను ఒక్కసారే ఆడించేవి. పందిరి గుంజకు అటు చుట్టూ, ఇటూ తిరుగుతుండేవి. లాక్యానాయక్ వెళ్ళి వాటి నుదురు మీద ముద్దాడి వాటి మెడపైన చేతిని నిమిరితే వాటి తలను గుండెలపై పెట్టి నిద్రపోయేవి వాటి పగ్గాలు విడిచి 'బ్రూ...ఛే....' అంటే వెళ్ళి నీళ్ళు తాగేసి వచ్చేవి. వాటికి మేత వేస్తే పరమానందంతో తినేవి. వాటిని చూసి లాక్యకు సంతోషమేసేది.

కాళ్ళకి రాయి తగిలి ధ్యాస నుంచి బయటికొచ్చాడు. తల రుమాలు సగం తడిసింది. ఎడ్లు తలలూపుతూ నడుస్తున్నాయి. వాటి వీపు మీద చేతితో నిమురుతూ ఇవే చివరి క్షణాలేమో అనుకుంటూ లాక్యానాయక్ నాగలి భుజాన వేసుకుని చేలల్లోకి వెళితే యుద్ధానికి సిద్ధమన్నట్లు లేచి నిలబడేవి. వాటి పగ్గాలు విడిచి, నొగనూ ఎత్తితే కాణికింద తమ మెడను చేర్చి దున్నిపారేద్దామన్నట్లు పొలంలోకి వెళ్ళేవి. బండిని కడితే ఎంత బరువైనా అవలీలగా ఇంటికి తెచ్చేవి. తాగి బండిలో పడుకుంటే ఇంటికి చేరి, అరుస్తూ లేపేవి.

ఒక్కసారి తాను అదుపు తప్పి బావిలో పడిపోతే బావి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అరుస్తూ 'మాకు ఈత వస్తే కాపాడుకుందుమే ' అన్నట్లు అరుస్తున్నాయ్.

"కాపాడండి, కాపాడండి" అంటూ బావి నీళ్ళలో మునిగి, తేలుతున్న లాక్యను చూసి చుట్టూ పరిగెత్తుతున్నాయి. చుట్టుపక్కల వారు వచ్చి సమయానికి రక్షించారు. మరా ఎడ్లను అవి లేకపోతే తనేమైపోను అని మెచ్చుకుంటున్నారు. లాక్యానాయక్ వాటి కాళ్ళపై పడినాడు ఎడ్ల కళ్ళనుంచి కారిన నీటిధారలు స్పష్టంగా కనిపించాయి. డబ్బులు లేనినాడు

ఎవరైనా అద్దెకు అడిగితే ఎడ్లను ఇచ్చేవాడు. వాళ్ళు బాగా మొరటోళ్ళు, జాలి, దయ లేనివాళ్ళు. ముల్లు కట్టెలతో గుచ్చి గుచ్చి రక్తం కళ్ళచూసేవాళ్ళు. ఆ రక్తపు మరకలు కనపడకుండా ఎడ్లు వాటి తోకలతో తుడిచేసేవి. అయినా ఈగల గుంపు మాత్రం గాయాలను చూపుతూనే ఉండేవి. వాళ్ళను అడిగేద్దామని ఆవేశంతో వెళ్ళినా డబ్బు తీసుకున్నది గుర్తుకొచ్చేది. అయినా అడిగేసరికి 'ఎడ్లు సరిగా పనిచేయలేవు డబ్బు తీసుకోలేదా?' అని రాగాలు తీస్తూ ఎదురు చెప్పేసరికి లాక్యానాయక్ మారుమాట్లాడకుండా వెనుదిరిగేవాడు.

ఒకసారి బాధతో గట్టుపైన ఎడ్లను మేపుతూ కూర్చుంటే అవి మేతని మాని తన దగ్గర జరిగి కూర్చుని తోకతో బాధపడవద్దంటూ చరిచేవి. లాక్యానాయక్ అలికిడి వింటే చాలు కన్నులు పెద్దవిగా చేసి, చెవులు రిక్కరించి చూసేవి. ఇవన్నీ ఆలోచిస్తూ వెళ్తుంటే కన్నీరింకా ఎక్కువైంది. ఇప్పటివరకూ సతాయించకుండా సాయపడిన ఎడ్లకు నేను ఇస్తున్న ప్రతిఫలం, ఏంటిది. ప్రతి పనిలో తనతో పయనమైన వాటినా తాను వదిలించుకోవాలని చూస్తున్నది. అమ్మకూడదు నా జన్మలో ఇలాంటి ఎడ్లను చూడను. చూడలేననుకుంటూ పోతున్నాడు వెనుదిరుగుదామంటే చాలా మైళ్ళ దూరం వచ్చేసానే ఇప్పటికా నాకు జ్ఞానోదయం అయ్యేది అంటూ ఏడుస్తూనే ఆలోచిస్తున్నాడు.

అంతలో తెల్లవారింది. సంత దగ్గర పడుతునంది. సంత నుంచి అరుపులు విని, సంతకు చేరుకున్నానని తెలుసుకున్నాడు. సంతలో అనేక ఎడ్లున్నవి. పాపం ఈ ఎడ్లని ఎంత ఇష్టంగా కొనుక్కున్నారో. గుండెల్లో ఎంత బాధ ఉంటే అమ్మేసుకుంటారు. బహుశా వీళ్ళందరూ అప్పుల బాధితులే. అప్పుల వాళ్ళతో పీడించబడిన పీడితులే. సంత ఎడ్లతో కళకళలాడుతుంది. అమ్మడానికి వచ్చినవాళ్ళు, కొనడానికి వచ్చినవాళ్ళు. మధ్య వర్తులు. కొందరు ఎడ్లను పోగొట్టుకుని, వెతకడానికి వస్తే, కొందరు సంత చూడడానికి వచ్చారు. అందరూ ఎండలో తలమీద తువ్వాల వేసుకుని కొనుక్కునే వారి కోసం ఆశగా చూసేవాళ్ళే. ఎక్కువకు అమ్మాలి. ఎక్కువ డబ్బులు రావాలి. అప్పు కట్టాలని, భూమి కొనాలని, ఇల్లు కట్టాలని, బోరు బావి వేయించాలని ఆశతో ఉన్నవాళ్ళే. కానీ, ఎడ్లను అమ్మితే వారికి తలచినంత డబ్బు వస్తుందా అనేదే ప్రశ్న. ఆ సంతలో కొందరు ఆకతాయిలు ఎడ్ల బేరమాడి అయిదువేలకే, ఎనిమిది వేలకే అడిగి వేళాకోళం చేసేవాళ్ళు. కొందరు ఎద్దును పరీక్షగాచూసి, మళ్ళీ తిరిగి వస్తానని చెప్పి, వస్తాడేమోనని ఎదురు చూపులో పడవేసేవాళ్ళే ఎక్కువగా ఉంటారు. కొందరు ఏ ఊరినుంచి వచ్చావని, అడిగి వారి ఊరి వాళ్ళయితే వారి బంధువుల గురించి అడిగేవాళ్ళు. ఇలా రకరకాల జనులతో సంత కళకళలాడేది. అక్కడ బాధ, దుఃఖం, సంతోషం, సంబరం కలిగేది.

ఇంతలో లాక్యానాయక్ ఎడ్లను చూసి ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. వారిని చూసి లాక్యానాయక్ బాగా డబ్బున్న వాళ్ళుగా కనబడుతున్నారు. వారు తన ఎడ్లను చూసి, ఎక్కువ ధరకు కొనుక్కుంటారని ఆలోచించుతున్నాడు. కానీ, వారు వచ్చి చూసినట్లే చూసి వెళ్ళిపోయారు. అలా ఎండలో నిలబడి చెమటలు కారుతున్నాయి. ఎడ్ల కాళ్ళు నొప్పి పెడుతున్నాయి కాబోలు ఇటు, అటు కదులుతూ కాళ్ళను ఆడిస్తున్నాయి. నిలబడి, నిలబడి చిరాకు వచ్చేసింది. ఎంతకు తీసుకున్నా ఇచ్చి పోదామని అనుకున్నాడు. తరువాత తన వైపు ఇద్దరు రైతులు రావడం చూశాడు. ఆ రైతులు లాక్యానాయక్‌ని అప్పువాడి

నుంచి విముక్తి చేయడానికి వచ్చినట్లు, తన గండం గట్టెక్కుతుందని, తన యింటిని తాకట్టు పెట్టాలని అనుకున్న ఆ షావుకారు మొఖంపై డబ్బు కొట్టాలని అనుకుంటున్నాడు ఆవేశంగా.

ఆ రైతులు తనలాగ వ్యవసాయం చేసుకుంటారని వారి దగ్గర ఉంటే బాగుంటాయని ఆలోచిస్తున్నాడు. తన ఎడ్లు మాత్రం అమాయకపు చూపులు చూస్తున్నాయి. బహుశా అవి ఇలాంటి సంతను చూళ్ళేదో, సంతకు ఎప్పుడూ రాలేదో వింతగా చూస్తున్నాయి. లాక్యనాయక్‌ని అంటివున్నాయి. అంతలో ఆ ఇద్దరు రైతులు వచ్చి ఎడ్లను అడిగారు. 50,000రూపాయలకి కొనాల్సిన ఎడ్లను 10 వేల రూపాయలకే అడిగారు. తాను షావుకారుకు అప్పువున్నది 20,000రూపాయలు. పొద్దున్నుంచి నిలబడి కాళ్ళు, కళ్ళు కాయలు కాస్తున్నాయి. వచ్చిందే మంచి బేరం అనుకుంటూ "చూడండయ్యా" అని చెప్పాడు. ఆ రైతులు "మేం చూసే చెప్పాం" అని బదులు చెప్పారు. పదివేళు వచ్చినా అవే పదివేలు అనుకుంటూ ఒప్పుకున్నాడు. 200రూపాయలు బయాన కూడా తీసుకున్నాడు. ఎడ్లు దూరమవుతున్నాయనే బాధతో అక్కడినుంచి కదలకుండా నిలకడగా నిలబడ్డాడు.

తన ఎడ్లను అమ్ముతున్నట్లు రసీదు తీసుకోవడానికి వెళ్ళాడు లాక్యనాయక్. ఆ రసీదు మీద వేలి ముద్ర వేస్తే తన ఎడ్లు ఎవరికో సొంతమవుతాయి. ఇక తిరిగి ఆ ఎడ్లను చూడలేడు. ఆ రసీదు మీద ఎడ్లు కొన్నట్టు, అమ్మినట్టు సాక్షులు ఉంటారు. ఎవరైనా ఆ రసీదును అనుసరించకుంటే జరిమానా విదిస్తారు.

ఇక శాశ్వతంగా ఎడ్లను మరిచిపోవాలి. ఒకవేళ ఆ రసీదు మీద సంతకం చేసి, తిరిగి ఎడ్లను పొందాలంటే కొన్నవాడు ఎంతకు అమ్మితే అంతకు తీసుకోవాలి. లాక్యనాయక్ ఆ రసీదు మీద వేలిముద్ర వేయబోయాడు. అంతలో ఆ రెండెడ్లు తమను వదిలేసి ఎక్కడికి వెళ్ళాడో అన్నట్టు ఒక్కసారి అరిచాయి. ఆ అరుపుల అర్థం అతనికి తెలుసు. కొత్తగా తీసుకుంటున్న వారికి ఎలా తెలుస్తుంది. ఆ రసీదు అక్కడే పడేసి పరుగున వెళ్ళి ఎడ్ల మెడను పట్టుకుని ఏడిచాడు. ఏడ్వవద్దన్నట్టు ఆ ఎడ్లు తమ నాలికతో చెంపను నాకినాయి. అప్పటికి ఆ ఎడ్లకు విషయం మొత్తం అర్ధ అయినట్లున్నది. ధర చేసిన రైతులు వచ్చి తమకు తోచిన విధంగా తిట్టిపోశారు. "ఇంత ప్రేమ వుంటే ఇంట్లో పెట్టుకుని పూజ చేసుకోవాలి. ఇక్కడిదాకా ఎందుకు తేవడం" తిట్టారు.

'నీకు చేతకాకుంటే తీసుకెళ్ళు. మా బయాన ఇచ్చిన పైసలు మాకు ఇచ్చేయి' అని అరిచారు. చుట్టుపక్కల వారు వీరిని గమనిస్తున్నారు. ఇందులో కొందరు బాధపడుతున్నారు. కొదరు పాపం అనుకుంటున్నారు. కొందరు అమ్మినంక ఈ నాటకం ఎందుకని కసురుకుంటున్నారు. కొందరు నవ్వుతున్నారు. ఆ రైతుల మాటలు వింటుంటే నిన్న అప్పుకోసం షావుకారు యింటికి వచ్చి, తాకట్టు పెడతానని చెప్పిన మాటలు గుర్తుకు వచ్చినాయి. కన్నీళ్ళు తుడుచుకుని ఆ రసీదు మీద తన వేలిముద్రను వేశాడు. ఆ రైతులు తామే గెలిచామంటు విజయగర్వంతో తమ చొక్కా గల్లలను పైకి ఎగరేశారు. ఆ రైతులు ఇచ్చిన 10,000రూపాయలు తీసుకుని తన దోవతి కొసకు కట్టుకుని తన బొడ్డులో దోపుకున్నాడు. ఆ ఎడ్ల కాళ్ళకి దండం పెట్టాడు క్షమించమంటు.

ఆ ఎద్లు వెనకకు జరిగాయి వద్దంటూ వారిస్తున్నట్లు. తమ రెండు కాళ్ళను పైకిలేపాయి అవి దండం పెడుతున్నట్లు. ఆ రైతులు తమలో తాము సంతోషపడ్డారు. చాలా చవక ధరకే దొరికాయని. అక్కడ చిత్రం చూస్తున్న వాళ్ళు ఇతను ఇంత అమాయకుడు కాకపోతే ఇంత చౌక ధరకే అమ్మివేస్తాడా అని ముక్కుమీద వేలువేసుకున్నారు. కొందరు ఎంత బాధలో ఉంటే, ఎంత అప్పులో ఉంటే చౌకగా అమ్మాలి అన్నట్లు గుసగుసలాడుతున్నారు. అవి లాక్యానాయక్‌కి స్పష్టంగా వినబడుతున్నాయి. తన బాధ ఎవరికీ తెలియదంటూ ఊరుకున్నాడు.

ఆ రైతులు తమ తాడును ముక్కు తాడుకు కట్టి ఎద్లను లాగారు. అవి ఎంతకు రాకపోయేసరికి బలవంతంగా లాగారు. ఎద్లు అసలు ఇంచి కూడా కదలలేదు. ఆ రైతు కొరడాను ఝుళిపించాడు. లాభం లేకపోయింది. ఆ కొరడాతో ఎద్ల వీపుపై కొట్టాడు. మరో రైతు ముక్కు ఊడిపోయేట్టు తాడు లాగినా కొంచెం కూడా ముందుకు కదలలేవు. ఇదంతా కింద తలవేసి గమనిస్తున్న లాక్యానాయక్ పరుగున వచ్చి ఆ కొరడాను లాక్కున్నాడు. ఆ రైతును పక్కకు తోసినాడు. ఆ ఎద్ల తడును పట్టి రోడ్డెక్కించాడు. ఆయినా అక్కడి నుంచి కదలలేదు. లాక్య వైపు చూస్తూనే నిలడినాయి. మళ్ళీ కొరడాతో కొట్టాడు. ఆ ఎద్లు ఆ దెబ్బలను ఆనందంగా అనుభవిస్తున్నాయి. వాటి వీపు మీద పడే ప్రతి దెబ్బ లాక్యానాయక్ గుండె మీద వాత ట్లు అనిపించింది. చేసేది లేక వారిని వారించి ఆటో మాట్లాడి అందులో ఎక్కించారు.

అందులో ఎటూ కదలకుండా ఆ కాళ్ళను కట్టి కిందకి పడేశారు. ఆ ఎద్లకు కళ్ళలో తెల్లని గుడ్డు బయటికి వచ్చి, నాలుకను బయటికి వేలాడదీసి 'వెళ్తున్నాం' అన్నట్టు దీనంగా చూశాయి, అవే ఆఖరి చూపులన్నట్లు. ఆ ఎద్లతో గడిపిన రోజులు, వాటి జ్ఞాపకాలను నెమరవేస్తూ ఏడుస్తూ ఇంటిదారి పట్టాడు. వాటికి తన బాధ చెప్పుకున్నా అర్థం అయ్యేది. కానీ ఈ రోజు ఇంతగా చూస్తున్న వాటి కళ్ళల్లో మాత్రం లాక్యకు బాధ కనపడలేదు. ఆ ఎద్ల అడుగులను చూస్తూ ఆ మట్టిని తీసి తన కళ్ళకు అద్దుకున్నాడు. కొంత దోతి కొంగున కట్టాడు. తనకు తానే డబ్బుల కోసం అమ్మడానికి మనసెలా వచ్చిందని తిట్టుకున్నాడు. మూర్ఖుడినని, పాపం ఊరికే పోదు అంటూ తల బాదుకున్నాడు. ఆ ఎద్ల అడుగుల గుర్తులో ఉన్న మట్టిని తీసుకుంటూ రుమాలులో పోసుకుంటూ, పోగేసుకుంటూ ఇంటికి వెళ్ళాడు. ఇంటికి చేరాడు. మనశ్శాంతి లేదు. సర్వం పోగొట్టుకున్న అనుభూతి. ఎవరు కనబడినా అప్పుకోసం ఎద్లను అమ్ముకుంటారా అని ప్రశ్నిస్తూనే ఉన్నారు. కానీ, తన బాధ ఎవరికి తెలుసు. పోనీ, ఎవరైనా సహాయం చేశారా అదీ లేదు. అప్పు ఇచ్చిన కుబేరుని డబ్బులు ఇచ్చాడు. తను తీసుకున్న డబ్బులు తిరిగి నోట్లే ఇచ్చాడు. కానీ, అమ్ముడు పోయిన ఎద్లను ఎవరు ఇస్తారు? అలాంటి ఎద్లు తిరిగి వస్తాయా అని ఆలోచించసాగాడు.

అమ్మి కొన్ని రోజులు కూడా కాలేవు. ఏ పని లేకున్నా పొలంలోకి వెళ్ళి 'మోరియా' అని పిలవడం, తన భార్యను పొలంలో ఎద్లకు మేత వేసి వస్తానని చెప్పడం చేస్తుండేవాడు. కనబడకపోయినా పిలుపు మీద పిలుపు, ఎవరూ పలికేవారు కా ఉలిదుకేవారు కాదు. తన ఎద్లుంటే పరిగెత్తుకుంటూ వచ్చేవి. తనని చూసి, తన పలుకు విని అరిచేవి. తోకాడించేవి. అసలుంటే కదా. ఎప్పుడు మాయమైనవి. అప్పుల వాడికి తన ఎద్లు ముట్టిపోయినాయి. తనకు ఇంత చేసినా తానేమీ

చెయ్యలేదు. తన అప్పు తీర్చడానికి అవి తన కోసం త్యాగానికి సిద్ధపడ్డాయి. సంతలో సరుకులయ్యాయి. తాను మనిషికాదు. మమకారం, కనికరం లేని కసాయి వాడు అని తిట్టుకున్నాడు. తన చేతులను తన చేతులతో నరుక్కున్నానని ఏడ్చాడు.

తన బాధను వినేవాళ్ళున్నారు. ఆ మూగజీవుల బాధను ఎవరు అర్థం చేసుకోలేదు. చచ్చేంత వరకు తనకు తోడుంటామని ప్రమాణం చేశాయేమో, తమ తల్లిదండ్రులకి, అందుకే తనంటే అంత ప్రేమ ఆ ఎడ్లకి అనుకుంటూ ఏడ్చాడు. ఎవరైనా ఏమైందని అడిగితే ఏమీలేదని సమాధాన మిచ్చేవాడు. ఒకరోజు తన ఎడ్లను చూడడానికి ఆ రైతు పొలానికి వెళ్ళాడు. అక్కడ గట్టునెక్కి 'మోరియా' అని పిలవగానే ఆ ఎడ్లకు ప్రాణం లేచి వచ్చాయి. ఒక్కసారిగా లేచి నిలబడ్డాయి. తమ యజమాని పిలుపన్నట్లు కలయ తిరిగి చూశాయి. అరవడం మొదలు పెట్టాయి. ఎన్నిరోజుల నుంచి ఎన్నిసార్లు తనకోసం చూశాయో? ఎవరు పిలిచినా తాను పిలిచినట్లే అనుకుని ఎన్ని సార్లు లేచాయో అనుకున్నాడు. ఆ ఎడ్లకు లాక్యనాయక్‌ని చూసి ఆ రెండెడ్లు కట్టిన గుంజ చుట్టూ తిరగడం, ఆ తాడును తెంపుకున్నంతగా బలంగా లాగసాగాయి. అతనిపై బెంగతో మేత మేయకుండా అంత బక్క చిక్కిపోయాయి. లాక్యనాయక్ ఆ ఎడ్ల మెడను పట్టుకుని భోరున ఏడ్చాడు. అక్కడ ఏం జరిగిందని ఆ రైతు పరుగు పరుగున పనులు వదిలి వచ్చి చూశాడు. లాక్యనాయక్ ఏడుస్తూ కనిపించినాడు.

"నీకేమైన మతిపోయిందా? అంత పెద్దగా ఏడుస్తున్నావ్. అమ్ముకున్నాక ఇంకా ఏడుపు ఎందుకు ఫో!ఫో" మంటూ కసురుకుంటూ తన పనిలో తాను నిమగ్నమైనాడు. అతను ఏడుపుమాని కన్నులారా చూసుకుని వచ్చేస్తున్నాడు. అతనితో రావాలంటూ ఎడ్లు ఒకదానితో ఒకటి గొడవపడుతున్నాయి తీసుకెళ్ళమని చెప్పమని అన్నట్టు. ఆ కట్టిన గుంజల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ, తెంపుకుని వచ్చేయాలని ప్రయత్నిస్తున్నాయి.. ఆ బాధను చూసి ఆ పందిరి కూడా చలించసాగింది. గుండె భారంతో ఇంటికి వెళ్తున్నాడు.

'మేం ఏమి పాపం చేశాము? మమ్మల్ని ఎందుకు వనవాసంలో వదిలిపోతున్నావ్' అన్నట్లు చూస్తున్నాయి. అరుస్తున్నాయి. ఆ చూపులను నెమరువేస్తూ ఇల్లు చేరాడు.

తిండి మానేశాడు. భార్య వచ్చి ఏమైందని అడిగినా కూడా మాట్లాడడు. తన గుండెలోని బాధను ఎవరికీ పంచుకోడు. పదిమందితో కలవకుండా దూరంగా ఉండసాగాడు. చూసే వాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వి దయ్యం పట్టిందని హేళన చేసేవారు. ఎవరైనా వచ్చి లాక్యనాయక్‌ని అడిగితే "నా శరీరంలో ముఖ్యమైన భాగాలైన నా ఎడ్లను అప్పుకొరకు అమ్ముకున్నాను. నాదేం 'నసీబ్' అంటూ ఏడ్చేసేవాడు. తన ఎడ్లపైన అంత ప్రేమ చూపిస్తున్నందుకు చలించి "నీ ఎడ్లను తీసుకుని రాపో" అంటూ యిరుగుపొరుగు వాళ్ళు తలో కొంత డబ్బు ఇచ్చారు.

లాక్యనాయక్ కళ్ళల్లో వెలుగు వచ్చింది. మొహంలో చిరునవ్వు వెలిగింది. ఎగిరి చిందేసేంతగా ఆనందించాడు. చేతిలో డబ్బు పడగానే తన ఎడ్లు ఇంటికి వస్తున్నాయని ఎప్పటిలాగా తన ఎడ్లను చూసుకుంటానని తన ఎడ్ల కొరకు

పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. ఆ డబ్బులు ఆ రైతు కిచ్చేసి తన ఎడ్లను తొందరగా విడిపించుకుని ఆనందంతో రావాలని ఆత్రుతతో పెద్దగా అడుగులేస్తూ, బలంగా నడుస్తున్నాడు. తన బరువుతో తన అడుగులు స్పష్టంగా కనబడుతున్నాయి. ఎవరు పిలిచినా పలకకుండా, ఎవరు కనబడిన పిలవకుండా పరుగెడుతున్నాడు.

ఎవరినైనా పలకరిస్తే తను వెళ్ళే పనిని ఎక్కడ మరిచిపోతానేమోనని దించిన తల ఎత్తకుండా పరుగెడుతున్నాడు. గుండె వేగంగా కొట్టుకుంటుంది. కడుపులో అన్నం లేక నీళ్ళు కింద మీద కదలాడుతున్నవి. చెమటలు పట్టి మెడను వెన్ను ముక్కలో పారి దోవతికి తడిపి వేస్తుంది. ఏదేదో మాట్లాడుతూ పరుగెడుతున్నాడు. తన మాటలే తనకు స్పష్టంగా వినబడడంలేదు. ఆ రైతు పొలంలో గట్టు నెక్కి ఆనందంతో నేనొచ్చానంటూ "మోరియా" అని పిలిచాడు. ఎక్కడ ఏ చిన్న శబ్దం వినబడలేదు. మళ్ళీ పిలిచాడు మళ్ళీ మౌనమే సమాధానంగా వచ్చింది. ఇలా నాలుగైదు సార్లు పిలిచాడు. లేదు. ఏం లేదు. ఆ పందిరి శూన్యమై నిల్చుంది. నన్నడగవద్దంటూ తలదించుకుంది. లాక్యనాయక్ తన ఎడ్లను కట్టిన గుంజలను పట్టుకుని ఏడవడం మొదలుపెట్టాడు. తన ఎడ్లు కూర్చున్నట్టు తలచి మీద పడడం, లాక్యనాయక్ కిందకు పడడం చేస్తున్నాడు. ఆ రైతు ఎక్కడైనా పని చేయించుకుంటున్నాడేమోనని ఆ దుఃఖపు కన్నులతో కలయ చూశాడు. కనుచూపు మేరలో కనిపించలేదు. తన కన్నీరు కనుపాప చుట్టూ ఆవరించి ఒక వ్యక్తి తనవేపు వస్తున్నట్లు ఆ ఒక్కడే రెండుగా కనబడుతున్నాడు. ఎవరని తన కన్నులను గట్టిగా మూసి బలవంతంగా కన్నీరు కార్చి చూశాడు. తన ఎడ్లను కొన్న రైతు కోపంతో పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. అల్లంత దూరం నుంచి చూసి తనకు సగం ప్రానం లేచి వచ్చింది. తన ఎడ్లు కనబడక సగం ప్రానం చచ్చింది.

ఆ రైతును చూసి లాక్యనాయక్ కాస్త స్థిమితపడ్డాడు. తన ఎడ్లను ఎవరికైనా అద్దెకు ఇచ్చాడేమో? 'అదిలి బదిలి'గా ఇచ్చాడేమో? అనుకున్నాడు. ఆ రైతు కోపంతో ఊగిపోతూ పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. ఆ రైతు దగ్గరికి వచ్చేసరికి లాక్యనాయక్ తన మోకాళ్ళపై పడి "అయ్యా! నా ఎడ్లు నాకు కళ్ళులాంటివి. నా ఎడ్లు నాకు ఇచ్చెయ్యి. నీ డబ్బులు ఇదిగోనంటూ" తాను తెచ్చిన డబ్బులు తీసి చూపించాడు ఏడుస్తూ. అది చూసి ఆ రైతు కూడా కంటనీరు తెచ్చుకున్నాడు.

"ఎందుకు నీకు ఆ ఎడ్లంటే అంత ప్రేమ, అలా ఉన్నప్పుడు ఎందుకు అమ్ముకున్నావు" అని రైతు ప్రశ్నించాడు.

"అయ్యా నా ఎడ్లు ఎక్కడున్నవి? నేను షావుకారు దగ్గర ఎరువులు తీసుకున్నాను. అది సంవత్సరం దాటకముందే ఇరవై వేలు అయ్యింది. నేను కనబడిన ప్రతిసారి ఆ డబ్బులు ఇవ్వమంటూ, అందరి ముందు అడగడం. నా ఇజ్జత్తు తీయసాగాడు. ఒకరోజు ఇంటిమీదకి వచ్చి డబ్బులు ఇవ్వకుంటే, అప్పుకింద నా ఇంటిని తాకట్టు పెడతానని బెదిరించాడు. వాడితో మాటలు పడలేక తన అప్పును తీర్చాలని, నా ఎడ్లను అమ్మకానికి పెట్టా"నని తన బాధను పూసగుచ్చినట్లు చెప్పాడు లాక్యనాయక్. అతని దీనస్థితిని, తన దయనీయమైన మొఖాన్ని చూసి కోపంతో ఊగిపోతున్న ఆ రైతు కూడా కన్నీళ్ళతో తన కళ్ళను తడిచేసి, తుడుచుకున్నాడు. కొంతవరకు ఆ రైతు నోటమాట రాలేదు. మళ్ళీ లాక్యనాయక్ కల్పించుకుని "అయ్యా! నా ఎడ్లు కనబడడం లేదు. ఎక్కడున్నాయి?" అని అడిగాడు. ఆ రైతు తేరుకుని తాను తన

మోకాలమీద పది నన్ను మన్నించమని కోరుతూ చిన్నగా "నీ ఎడ్లుని ఎన్నిరోజులనుండీ కాపాడుకుంటూ వస్తున్నావో నీ స్థితిని చూస్తే అర్ధమవుతుంది. నేను తెచ్చి వారం రోజులు కూడా కాలేదు. అవి నీమీద అనురాగంతో నా దగ్గర సరిగ్గా పనిచేయలేదు. తిరిగి నీవు తీసుకెళ్తావనుకున్నాయేమో? అందుకే నేను బన్నాజికి అప్పచెప్పాను" అని రైతు చెప్పాడు.

లాక్యనాయక్ బన్నాజి ఎవరు? ఎక్కడో విన్నట్టుందే పేరు. గుర్తుకు వచ్చి ఏడ్చాడు.

బన్నాజి ప్రతి అంగడి తిరిగేవాడు. ఎడ్లను ఒకరి చేతినుంచి మరొకరి చేతిలోకి మార్చడం, తాను మధ్యవర్తిగా ఉండేవాడు ఎవరైనా ఎడ్లనుగానీ, ఆవునుగానీ, బర్రెలనుగానీ కొనాలనుకున్నా, అమ్మాలనుకున్నా మొదటగా సంప్రదించవలసింది ఇతనినే. ఎవరికైనా గిట్టుబాటు ధరకాకుంటే ఇతనే గిట్టుబాటు ధర చెప్పి ఇద్దరిని ఒప్పించి, తన కమీషను వాడు తీసుకునేవాడు. బన్నాజి ప్రతి ఊరు తిరుగుతుండేవాడు. ఎడ్ల గురించి అతని దగ్గర తగిన సమాచారముండేది. అతను ఎడ్లను అమ్మినందుకు కొనిపించినందుకు తనవంతు కమీషను తీసుకునేవాడు. కమీషనులో ఒక్కరూపాయి తగ్గినా ఊరుకునేవాడు కాదు. అతనికి ముసల్మానులతో దోస్తానా ఉన్నది. 'ఖటిక్'తో ఎక్కువగా తిరిగేవాడు. ఎవరైనా ఎడ్లను కొన్నా, అమ్మినా ఇతనికి తెలిసేది. ఇతను వారికి సాక్షిగా నిలబడేవాడు. తాను అమ్మించిన, కొనిపించినా ఎడ్లను అప్పుడప్పుడూ అటుగా వెళ్తే చూసేవాడు. మంచి ధర వస్తే ఎడ్లను 'ఖటిక్'కి ఇచ్చేవాడు. వారు పట్నానికి తరలించేవారు. ఇలా ఎడ్లపై వ్యాపారం చేస్తుండేవాడు బన్నాజి.

ఒకరోజు బన్నాజి ఇటుగా వచ్చాడు. అతను ఎడ్లను చూసి, "బాగున్నాయా? బాగా పనిచేస్తున్నాయా? దీనితస్సాదీయ ఎవరి దగ్గర కొన్నా"వంటూ ప్రశ్నలు అడిగాడు.

అప్పుడు "ఏం చెప్పను బన్నాజీ అసలు పనిజేస్తనేలేవు. నీళ్ళు తాగించాడానికి ముక్కతాడు ముక్కు ఊడిపోయేలా లాగాలి. నీళ్ళు తాగించాలి. అయినా తాగవు. తినడానికి గడ్డిని వేస్తే ఎడ్లు ఆ గడ్డిని కింద పరుచుకుని దానిమీద కూర్చుంటాయి. నాగలి కడితే ఒకటి ఒక వైపు, మరోటి మరోవైపు లాగడం చేస్తున్నాయి. నాకు అమ్మిన వాడికి ఇవి సతాయించాయేమో నన్ను తక్కువ ధరకే కట్టబెట్టాడు" అంటూ ఆ రైతు ముగించాడు.

లాక్యనాయక్‌కి నోట మాట రాలేదు. ఏమి చెప్పాలో అర్ధం కాలేదు. మెల్లగా "అయ్యా! నా ఎడ్లను తిరిగి పొందే అవకాశం, కనీసం చూసే భాగ్యం కూడా నాకు కల్పించవా! ఈ డబ్బుల కోసమే అమ్ముకున్నాను. ఈ డబ్బులు మనిషిని ఇంతలా ఆడిస్తాయని, చివరికి చంపివేస్తాయని తెలుసుకోలేదు. నా జేబుల నిండుగా డబ్బులు ఉన్నా నేను పోగొట్టుకున్న ఎడ్లను సాధించలేకపోతున్నాను. దేవుడా నన్ను కరుణించు" అంటూ బిక్కు బిక్కుమంటూ ఏడుస్తూ ఆకాశం వైపు తిరిగి ప్రార్ధించాడు.

మళ్ళీ "అయ్యా నీ డబ్బులు నీకు ఇచ్చేస్తాను. నా ఎడ్లను నాకు ఇప్పించు నీ రుణం తీర్చుకుంటా, బన్నాజి ఎక్కడ ఉంటాడు? ఎలా ఉంటాడు? నాకు తెలియదు నీవు కాస్త చూపెట్టి పుణ్యం కట్టుకో"మంటూ వేడుకున్నాడు. లాక్యనాయక్‌ని చూస్తే ఆ రైతుకు బాధేసింది. నీకు చివరిగా ఈ సహాయమన్నా చేస్తానన్నట్టు తల ఆడించాడు.

ఇద్దరు బన్నాజి కొరకు బయలుదేరారు. లాక్యనాయక్ దారి పొడవునా ఆ రైతుకు ప్రశ్నలు వేయసాగాడు. "నా ఎడ్లు అతని దగ్గరే ఉంటాయా? ఎవరికైనా అమ్మేసి ఉంటాడా? ఉంటే నాకు తిరిగి ఇచ్చేస్తాడా? ఎవరికి ఇచ్చాడో చెప్తాడా? ఆ ఎడ్లు లేకుండా నేను ఇంటికి ఎలా వెళ్ళాలి? నీవెందుకు ఇచ్చేశావ్" అంటూ అడుగుతూ ఉన్నాడు.

"మళ్ళీ వస్తానని నాతో చెప్పలేదు. చెపితే వారికీ ఇచ్చేవాడిని కాదు. నా దగ్గరే ఉండేవి" అని ఆ రైతు బదులు ఇచ్చాడు. "బన్నాజి నా ఎడ్లను నాకు ఇస్తాడా? ఇవ్వకుంటే అతని కాళ్ళు పట్టుకుంటాను. ప్రాధేయపడతా"నంటూ చెబుతున్నాడు. బన్నాజి ఇల్లు దగ్గరికి వచ్చేసరికి లాక్యనాయక్‌లో ఆనందం, కొంత విషాదం ఎక్కువైంది. అడుగులు చిన్నగా వేస్తున్నాడు .దూరంలో ఎడ్లు అరిచినట్లు వినబడిన వెంటనే 'మోరియా' అంటూ పిలుస్తున్నాడు. ప్రక్కనే ఉన్న రైతుకు ఆశ్చర్యం వేసింది. లాక్యనాయక్‌ని చూస్తున్నాడు. కొంత దూరంలో ఎడ్లు కనిపించిన తన ఎడ్లేనన్నట్లు పరుగెత్తుకుంటూ వెళ్ళి, ఆ ఎడ్లను సమీపించి చూసి నిరాశ చెందేవాడు.

"ఎంత చక్కని ఎడ్లు. ఏనుగువలె ఉండేవి. తెల్లని ఆకాశంలా మెరిసిపోయేవి. చిన్న మచ్చలేకుండా ఉండేవి. ఇప్పుడు ఎక్కడని వెతకాలి. ఎక్కడికెళ్ళి చూడాలి" అంటూ అక్కడే కూర్చుని తలపట్టుకున్నాడు. ఆ రైతు అతని దరికి వెళ్ళి "వెళ్దాం పద బన్నాజి ఎక్కడికైనా వెళ్ళిపోతాడ"ని చెప్పగానే లేచి ఆ రైతును అనుసరించాడు .

బన్నాజి ఇల్లు చేరినాక బయటనుంచే ఆత్రుతగా "బన్నాజి...బన్నాజీ" అని పిలిచాడు ఆ రైతు. లోపలినుంచి 'ఓ' అంటూ సమాధానం వచ్చింది. లాక్యనాయక్ అది ఆడగొంతా? మగగొంతా? అంటూ తొంగి చూశాడు. మనసులో సతమతమవుతున్నాడు. అంతలో ఆడామె బయటికి వచ్చింది. ఎవరు కావాలని అడిగింది.

లాక్యనాయక్ "అమ్మా! మాకు బన్నాజీ కావాలి. ఇంట్లో లేడామ్మ" అంటూ కన్నీరు పెట్టుకుని ఏడుస్తూ చెప్పాడు. ఆమెకు అర్థంకాక గుడ్లప్పగించి చూసింది. ఆ రైతు ఆమె చూపులను అర్థం చేసుకుని తనప్రశ్నను తిరిగి అడిగాడు. అటుగా వెళ్ళండంటూ చెప్పిందామె. లాక్యనాయక్ అటుగా పరుగెత్తడం చేశాడు. బన్నాజీ దొరుకుతాడో లేడో అన్నట్లు కొంత దూరంలో చింత చెట్టుకింద ఇద్దరు, ముగ్గురు తెల్లని పంచలు, తెల్లని చొక్కాలు వేసుకుని ఉన్నారు. లాక్యనాయక్ పరుగును చూసి ఒకతను ఎదురుగా వచ్చినట్లు వచ్చాడు. లాక్యనాయక్ తన రెండు చేతులను మోచెయ్యి వరకు జోడించి, నమస్కారం పెట్టాడు. "దండాలయ్య బన్నాజీగారు" అంటూ ఏడ్చాడు. ఎదురుగా వచ్చిన వ్యక్తి ఆ ఏడుపును అర్థం చేసుకోలేక బన్నాజి వైపు వేలు చూపెట్టాడు ఇతను బన్నాజి అని చెప్పినట్లు.

"అయ్యా బన్నాజిగారు నా ఎడ్లు బంగారంలాంటివి. వాటిని నేను కొడుకులుగా చూసుకున్నాను. అప్పులోడి లొల్లి భరించలేకే అమ్మేయడం జరిగింది దయచేసి నా ఎడ్లు నాకు ఇప్పించండి మీకు పుణ్యం ఉంట"దంటు లాక్యనాయక్. ఏడ్వడం మొదలుపెట్టాడు. ఏడవొద్దంటూ అతనితో వచ్చిన రైతు భుజం మీద చేయి వేసి వారించాడు.

బన్నాజీ "అసలేమైంది. నాకు అర్థం కావడంలేదు. నీ ఎడ్లు నేనెక్కడ తీసుకున్నాను. ఇప్పటివరకు నేను నిన్ను చూడనేలేదు. ఎక్కడ, ఎవరికి అమ్మావో దీనితస్సాదియ్యా గుర్తుచేసుకో నేను కాదు బాధ్యుడిని" అని చెప్పాడు.

అంతలో ఆ రైతు "బన్నాజీ మొన్న నా దగ్గరి నుంచి నువ్వేకదా ఏడ్లు పని చేస్తల్లేవంటే మంచి ధరకు అమ్మేస్తానని చెప్పావ్. ఆ ఎడ్ల బాధ్యుడు వీడు" అని చెప్పాడు.

బన్నాజి "ఏంటి, నీవు తక్కువకు తీసుకున్నాడని, నీ మీద ఫిర్యాదు చేస్తానంటున్నాడు  అందుకే మీరిద్దరూ కలిసి నా దగ్గరకు వచ్చారు అంతేకదా దీని తస్సాదీయ ఎన్ని చూడలేదు ఇప్పటివరకు" అని చెప్పాడు.

"చూడు నాయకుడా నీవు ఎడ్లను మా ఊరోడికి అమ్మినవ్. డబ్బులు తీసుకున్నవ్. చాలా రోజులైంది. ఇప్పుడు మళ్ళీ తిరిగి డబ్బులు తెచ్చి, ఇచ్చి ఎడ్లు ఇమ్మంటే ఎలా ఇస్తాడు. దీనితస్సాదియ్యా ఆ ఎడ్లు సరిగా పనిచేయకున్న వాడి దగ్గరే ఉన్నాయి కదా నాయకుడా" అని చెప్పి బన్నాజీతో ఉన్న ఇద్దరివైపు తిరిగాడు. వారు చూసినట్లు చెబుతున్నావని తమ నవ్వులో తెలిపారు. లాక్యానాయక్ మాట్లాడకుండా మౌనంపాటిస్తూ, తన కళ్ళను గట్టిగా మూసి కన్నీళ్ళను బయటకి తీస్తున్నాడు. వచ్చిన కన్నీళ్ళను కనబడకుండా, నేలమీద పడకుండా తన రుమాలుతో తుడుచుకుంటున్నాడు. ఆ రుమాలు చెమట వాసన ఆ కళ్ళకు రాక దానిని తుడవడానికి అనుమతిస్తున్నాయి. అంతలో మళ్ళీ బన్నాజీ "ఇగో ఈ ఇద్దరు ఎడ్ల గురించి కొట్లాడి నా దగ్గరకు వచ్చారు. ఒక వెయ్యి ఎక్కువ ఇచ్చిండు దీనితస్సాదీయా కలిసి పోయిండ్రు. చెప్పండి నీవెంత ఇచ్చినౌ, నీవెంత అడుగుతున్నావ్" అంటూ చెపప్సాగాడు.

అప్పుడు అ రైతు "అదికాదు అన్న, మొన్న నాదగ్గర నుంచి నువ్వు తీసుకొచ్చిన ఎడ్లు"

"ఔను తీసుకొచ్చాను. చెప్పాను కదా, నువ్వు పెట్టిన డబ్బుకంటే ఎక్కువిస్తానని, దానికి ఇంతగా ఇంకొకడిని తెచ్చి దీనితస్సాదియా ఇంత రభస చేసి, మీదికొస్తావా" అంటూ అరిచాడు. బన్నాజీతో ఉన్న ఇద్దరూ లేచి నిలబడ్డారు బెదిరిచండానికని.

"ఇస్తా, నీ డబ్బు కాస్తా ఈరోజు ఆగు. ఆ తురకాయనకు చెప్పాను. ఈ పాటికి వస్తుంటాడు" అంటూ చెప్పాడు. తురకాయన పేరు విని లాక్యానాయక్ తల పట్టుకున్నాడు. తలమీద ఉన్న రుమాలు తీసి నేలకేసినాడు. అచేతనంగా చెమటలు పుట్టినవి. శరీరంలోని చేతులు, కాళ్ళు వణకడం మొదలైంది. మాట బయటికి రావడంలేదు. మాట తడబడుతునంది. నోరు ఎండిపోతుంది. "దాహం, దాహం" అంటూ సైగ చేస్తున్నాడు. అది గమనించి పక్కనే ఉన్న తెల్ల పంచలోడు నీళ్ళ సీసాను ఇచ్చడు. నీళ్ళు తాగాడు. ఆ ఏడుపు ఎవరికీ అర్థంకావడంలేదు. నోటమాట రావడంలేదు. ఇదంతా గమనించి ఆ రైతు "బన్నాజీ మీరు నా దగ్గరనుంచి తెచ్చిన ఎడ్లు ఇతనియ్యే. అతను తిరిగి తీసుకెళ్ళడానికి వచ్చా"డంటూ చెప్పాడు.

"అవునా! ఇంకేం బాగున్నాయి నాయకుడా! నీ ఎడ్లు ఏం పెట్టి పెంచావోగానీ, దీనితస్సాదియా బాగా బలంగా ఉన్నా"యంటు చెప్పాడు బన్నాజీ.

ఆ రైతు కల్పించుకుని "అయ్యా ఆ ఎడ్లు అతనివే తిరిగి తీసుకెళ్ళడానికి వచ్చాడంటూ వచ్చాడని చెప్పాడు.

అరరె వాటిని ముస్లాను 'ఖటిక్‌కి' ఆ రోజే ఇచ్చేశాను. ఇప్పుడెలా?" అని చెప్పంగనే లాక్యానాయక్ కన్నీళ్ళు వరద ఆనకట్టను వదిలాడు.

"ఖటిక్‌కి" ఇచ్చారా! అతను ఇప్పటివరకు ఉంచగలడా? వాటిని హింసించి, ప్రాణాలను తోడేసి ఉంటాడు. చర్మం ఒలిచేసి వుంటాడు .ఏ భాగానికి ఆ భాగంగా వేరు చేసి ఉంటాడు" అని మనసులో బాధపడుతూ ఉన్నాడు.

ఆ రైతు కల్పించుకుని అతను తన ఎడ్లను చాలా బాగా చూసుకున్నాడు. ఇంతకు ముందు ఓసారి వచ్చి చూసిపోయాడు. అప్పుడు కూడా ఇదో ఇలాగే ఏడ్చాడు. ఆ ఎడ్లు అతనిపై ప్రేమతో సరిగ్గా పనిచేయలేదు. ఇతని బాధ చూడలేక అందరు ఇతనికి డబ్బులిచ్చి నీ ఎడ్లు విడిపించుకురమ్మంటు పంపించారు. దానితో డబ్బులిచ్చి తన ఎడ్లను తీసుకెళ్ళడానికి వచ్చాడు.

పక్కనే లాక్యానాయక్ ఏడుస్తూనే ఉన్నాడు.

ఆ రైతు "బన్నాజి చెప్పు. అతని ఎడ్లు ఎక్కడున్నవి?"

"దీనితస్సాదీయా ఆ రోజేగా ముసల్మానుకి ఇచ్చేసినా, వాడూ కొంటపోయిండు. నీకు డబ్బులు ఇస్తానని చెప్పిన కదా! ఎందుకు వచ్చినవ్ దీనితస్సాదీయా" అని అరిచినాడు.

అందరూ మౌనంగా ఉన్నారు. లాక్యానాయక్ మాత్రం మౌననాదాలు మీటుతున్నాడు.

దూరం నుంచి శబ్దం వస్తుంది. ఏంటిదని అందరూ చూస్తే దూరం నుంచి ఒక ద్విచక్ర వాహనం వస్తుంది. దానిపై బరువైన శరీరం ఇద్దరి స్థలాన్ని ఆక్రమించింది. మరొకరికి స్థలం లేకుండా. పెద్ద చొక్కా, మెడపైన రంగురంగుల తువ్వాలును కప్పుకుని ఉన్నాడు. వాహనం అసహనంగా అరుస్తూ "లొడలొడ"మని శబ్దం చేస్తూ వస్తున్నది. తొందరగా దిగమని కానీ, అతను దాని మాట విన్నట్టు లేదు. ఆ వాహనం ఎన్ని ప్రమాదలతో పరిచయం చేసుకుందో కానీ చాలా చోట్ల సొట్టలు పడి ఉంది. చూస్తున్నంతనే అది వారిని సమీపించింది. దానిపై ముసల్మాను బన్నాజి ఎడ్లను పట్టణానికి సరఫరా చేసేవాడు. దగ్గరకి వచ్చి "బన్నాజీ భాయ్, క్యా మాల్దియ్ అహై, బహుత్ మంచి గిరాకీ ఆయాహే! ఎక్కడ నుంచి తెచ్చావోగనీ, హే అల్లా, సబ్ ఆద్‌మీ కొట్లాట పడాహే. లేవో పైసే హజార్ రూపియె జదా దేరహాహు. బహుత్ ఖుష్ హు. వారు ఎవరు నీ దోస్తానా హా. యేలో ఔర్ పాంచ్ సౌ రూపియె, కుచ్ కావో, పీవో" అంటూ ఎవరినీ మాట్లాడనీయకుండా చేసి, బన్నాజి చేతిలో డబ్బులు పెట్టి కౌగిలించుకుని మళ్ళీ వస్తా"నంటూ వెళ్ళిపోయాడు.

బన్నాజితోపాటు అందరూ స్థంభించిపోయారు. లాక్యానాయక్ మాత్రం కింద కూర్చుని ఏడుస్తూనే ఉన్నాడు. ఆ ముసల్మాను ఆ లాక్యను గమనించనే లేదు.

బన్నాజి లాక్యానాయక్‌ని చూసి చిన్నగా మొఖం పెట్టాడు. తన చేతి మీదుగా ఎందరినో ఒప్పించి, మెప్పించి ఎడ్లను ధరను చేసినాడు. కానీ ఎవరూ ఇతనిలా ఏడవలేదు. మూగజీవుల మీద దయ, జాలి చూపెట్టలేదు. లాక్యను ఎలా

ఓదార్చాలో, ఎలా క్షమాపణ అడగాలో తెలియటం లేదు. తన చేతిలో డబ్బులున్నవి. లాక్య జేబులో డబ్బులున్నవి. వాటిని చూసి డబ్బుపోతే మళ్ళీ వస్తుంది కానీ, ఇష్టంగా ఉన్న తన ఎడ్లను ఎలా తేవడం అని అనుకుంటూ కిందకి తల వాల్చాడు.

లాక్యనాయక్‌ని ఆ రైతు లేవదీశాడు. వాడివైపు చూసి "నువ్వు కూడా కసాయి వాడివే నన్ను ముట్టుకోవద్దంటూ, చేతులారా అమ్ముకున్నావ్. నీవు రైతువు. నీవు మంచిగా చూసుకుంటావని నా ఎడ్లను నీకిస్తే నీవు వాటిని ఆహారంగా చేసుకుని సొమ్ము చేసుకున్నావ్. వాటిని వేలం వేసి చంపేశావ్ ఛీఛీ నీవు జంతువువి వదులు" అన్నట్లు తోసేశాడు. ఆ రైతు కూడా మానవత్వాన్ని మరిచి ఎడ్లను అమ్ముకున్నానన్నట్లు తల వాల్చేశాడు మన్నించమన్నట్లు.

లాక్యనాయక్ "నా ఎడ్లు, నా ఎడ్లు" అంటూ ఏడుస్తూ, తూగుతూ తన ఇంటిదారి పట్టాడు. అతను నడుస్తుంటే రెండు ఎడ్ల నడుమా నడుస్తున్నట్లు అనుకుంటూ "ఝూ, ఝూ" అంటూ నడుస్తున్నాడు. నడుస్తూ నవ్వుతున్నాడు. అంతలో ఏడవడం మొదలెట్టాడు. తన ఎడ్ల అడుగుల కింద నలిగిన మట్టిని ఎత్తుకుంటూ రుమాలు నింపుకుంటూ వెళ్తున్నాడు. తన చేతిలో ఆ మట్టిని రుమాలు నుండి తీసి ఆకాశం వైపు చల్లుతున్నాడు. చివరికి అక్కడ దుమ్ము, ధూళి తప్ప ఏమీ కనబడలేదు ఎవరికి.

COMMENTS